ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 13 జూన్ 2025

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వర్‌రావు

'రైతు నేస్తం' విస్తరణకు పచ్చజెండా

- అధిక దిగుబడులు సాధించేలా కార్యక్రమాలు
- జగిత్యాల జిల్లాలో ఇప్పటికే 19 రైతు వేదికల్లో ఏర్పాటు
- తాజాగా మరో 33 కేంద్రాలు మంజూరు

7

సమస్యలు 'డబుల్'

- నూకపల్లి అర్బన్ కాలనీలో మౌలిక వసతులు కరువు
- పూర్తి కాని నీటి ట్యాంకులు, అంతర్గత రోడ్లు
- ట్యాంకర్ నీటిపైనే ఆధారపడుతున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు
- అరకొర సౌకర్యాలతో జనం అవస్థలు

జగిత్యాల అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని నూకపల్లి అర్బన్ కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గత ప్రభుత్వ హయాంలో నూకపల్లి అర్బన్ కాలనీలో నాలుగున్నరవేల డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించారు. ఇందులో 3500 మంది లబ్ధిదారులకు అలాట్ చేశారు. కానీ కాలనీలో తాగునీటి ట్యాంకులు, అంతర్గత రహదారులు పూర్తి కాకపోవడంతో కేవలం 1000 కుటుంబాలు మాత్రమే డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంటున్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్లకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ 70కోట్ల రూపాయలను విడుదల చేయించినా పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివసించడానికి చాలామంది లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.



నూకపల్లి అర్బన్ కాలనీలో పూర్తిగాని అంతర్గత రోడ్డు

● తాగు నీటి గోస..

కాలనీలో 4500 కుటుంబాలకు సరిపడా తాగు నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో తాగునీటి కోసం జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు 1000 కుటుంబాలు మాత్రమే కాలనీలో నివసిస్తుండగా వారికి కూడా అరకొర నీటి సరఫరా జరుగుతోంది. ఆయా కుటుంబాలు నీటి ట్యాంకర్ పైనే ఆధార పడాల్సిన దుస్థితి నెలకొంది. మరో 3500 కుటుంబాలు ఇళ్లలోకి వస్తే ఇంకా తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం ఉందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

● ఆగని చెత్త వాహనాలు

నూకపల్లి అర్బన్ కాలనీలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోనే ఉన్నప్పటికీ జగిత్యాల మున్సిపల్ చెత్త వాహనాలు...

మిగతా 8లో



● పూర్తి కాని అంతర్గత రోడ్లు

నూకపల్లి డబుల్ కాలనీలో ఇప్పటి వరకు అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలుచోట్ల రోడ్లు ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షానికే బుర దమయం అవుతున్నాయని వర్షాలు తీవ్రంగా ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందని కాలనీ వాసులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పూర్తి అయిన రోడ్లతో పాటు ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లు పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 'అడ్లూరి'

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులను ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు గురువారం సీఎస్ రామ కృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లాకు చెందిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు నల్గొండ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలను అప్పగించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు నల్గొండ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడం పట్ల జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నూకపల్లిలో మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషిని జరపాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నూకపల్లి అర్బన్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌలిక వసతులపై కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక వసతులు, డ్రైనేజీ, విద్యుత్, వాటర్, అంగన్‌వాడీ స్కూలు, కమ్యూనిటీ హాల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, హౌసింగ్ పిడి ప్రసాద్, పీఆర్ ఈఈ లక్ష్మణ్ రావు, డీఈలు మిలింద్, నాగేశ్వర్, తహసీల్దార్ రాంమోహన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి

జగిత్యాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి గురువారం జిల్లా కోర్టు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగిత్యాల కోర్టు ఆవరణలో ఈనెల 14 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరంచారు. లోక్ అదాలత్‌లో చిన్న కేసులతో పాటు డ్రంకెన్ డ్రైవ్, ఈ చాలన్లు, సివిల్ తదితర కేసులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 3,559 కేసులు ఉన్నాయన్నారు. కక్షి దారులు సకాలంలో అదాలత్ కార్యక్రమానికి హాజరై తమ కేసులను పరిష్కరించుకునేందుకు చక్కని అవకాశమన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



హైదరాబాద్‌లో మినిస్టర్ క్వార్టర్‌లో మొక్క నాటుతున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం మొక్కలు నాటారు. ఇటీవల మృతి చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తిగా తీసుకొని వాశ్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ ప్రజాపతి ఒక సంవత్సరంలో లక్ష మొక్కలు నాటాలననే సంకల్పం తీసుకున్నారు. ఈ లక్ష మొక్కల కార్యక్రమంలో భాగంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తన అధికారిక నివాసంలో మొదటి మొక్కను నాటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కవి, గాయకులు మిట్టపల్లి సురేందర్, వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త జీఆర్‌కే రెడ్డి, గాజుల రవికుమార్, ఎడ్యుజోన్ సీఈవోలు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన మందకృష్ణ

హైదరాబాద్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గురువారం మందకృష్ణ మాదిగ సన్మానించారు. మంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేసిన అనంతరం మందకృష్ణ మాదిగ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట ఫీడర్ వద్ద చెట్ల కొమ్మలు తొలగించడం జరుగుతుందని దీంతో మల్యాల సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యంపేట గ్రామ పరిధిలో వ్యవసాయ బావులకు ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్ విద్యనభ్యసించడానికి అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోర్డినేటర్ చల్వాజీ నాగేశ్వరరావు, తపోవన్ హైస్కూల్ జగిత్యాల ఏఐ కోఆర్డినేటర్ అనుమల్ల శ్యాం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 12వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. 10వ తరగతి ఫెయిల్ అయిన 14ఏళ్లు నిండిన వారికి పదో తరగతి చదువుకునే అవకాశం ఉందన్నారు. 15ఏళ్లు నిండి పదో తరగతి పూర్తయిన వారితో పాటు, ఇంటర్మీడియేట్ ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియేట్ కోర్సు చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ నెల 13నుంచి జూలై 11వ వరకు అడ్మిషన్లు చేసుకోవడానికి అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9849266786 తపోవన్ హైస్కూల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

సారంగాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల కస్తూరిబా బాలికల వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహంను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వసతి గృహల్లో వంట గదులను, విద్యార్థులు పడుకునే గదులను హస్టల్ పరిసరాలను పరిశీలించారు. హస్టల్లో ఏమైన సమస్యలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీవో సీహెచ్ గంగాధర్, కస్తూరిబా ప్రత్యేకధికారి వీణ, ఎస్సీ బాలుర గృహం వార్డెన్ చంద్ర శేఖర్ రెవెన్యూ అధికారి ప్రసాద్ ఉన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

పెగడపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంగళాయిపేట వన నర్సరీని ఎంపీవో మహేందర్‌తో కలసి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో చేపట్టనున్న వనమహోత్సవానికి గ్రామాల వారీగా అవసరమగు మొక్కలను ఆయా గ్రామాలలోని వన నర్సరీలలోనే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల వన సేవకులు నాటాల్సిన లక్ష్యం మేరకు వన మహోత్సవానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, క్షేత్ర సహాయకులు తదితరులు ఉన్నారు.

'త్వరలో ఇంటర్ విద్యలో విప్లవాత్మక మార్పులు'



ప్రవేశాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంటర్ విద్యలో త్వరలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టనున్నట్లు ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకులు రావులపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న అడ్మిషన్‌ల ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై మాసం నుంచి ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇంటర్‌బోర్డు కమాండ్ సెంటర్ నుంచి ప్రతి అధ్యాపకుని బోధన తీరును పరిశీలించడం జరుగుతుందన్నారు. అధ్యాపకులు ముందుగానే 90 రోజుల కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ప్రవేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి బొప్పరాతి నారాయణ, ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, నాగభూషణం, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం-475 జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతి తదితరులున్నారు.

'సమాజ భాగస్వామ్యంతో బడులు బలోపేతం'



వెంకటాపూర్ పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈవో

వెల్గటూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమాజ భాగస్వామ్యంతోనే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయని జిల్లా విద్యాధికారి కె రాము అభిప్రాయపడ్డారు. బడిబాటలో భాగంగా గురువారం వెల్గటూరు మండలం లోని కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాల, వెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి.

ఈ సందర్భంగా వెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ముఖ్య అతిథిగా డీఈవో హాజరయ్యారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బడులలో విద్యార్థుల నమోదును పెంచి బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరు సహక రించాలని ఆయన కోరారు. ప్రధానంగా మూసివేత అనంతరం పున ప్రారంభమైన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బడులను కాపాడుకునే బాధ్యత స్థానికులపై ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. గత కొన్నేళ్ళుగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల మూతపడిన పాఠశాలలు తిరిగి తెరిపించడం అభినందనీయమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసిల్దార్ శేఖర్, సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరల్ అధికారులు చిప్ప సత్యనా రాయణ, కొక్కుల రాజేష్, మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యా యులు చిప్ప నందయ్య, పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు ఎల్ అరుణ, వీరబత్తిని శ్రీనివాస్, నీలం సంపత్ కుమార్, ఆర్‌ఐ రామ్ రెడ్డి, కార్యదర్శి ప్రసాద్, ఏఏపీసీ చైర్మన్లు రామిళ్ళ సత్త వ్వ, గంగరాజవ్వ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు వైద్య వెంక టేష్, రజిని, మాజీ సర్పంచులు విద్యాసాగర్, రాందేని కోటయ్య పాల్గొన్నారు.

మూత 'బడులు' తెరుచుకున్నాయ్..

● మామిడి తోరణాలతో అలంకారం ● ఉత్సాహంగా విద్యార్థుల హాజరు



మల్యాల మండలం రాంపూర్ పాఠశాల వద్ద విద్యార్థులు

మల్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం గురువారం ప్రారంభం కాగా గతంలో విద్యార్థులు లేక మూతబడిన మల్యాల మండలంలోని రెండు ప్రభుత్వ పాఠశాలలు తెరచుకున్నాయి. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలనే విద్యా శాఖ ఆదేశాలతో మండలంలోని కొంపల్లి, రాంపూర్ ఒడ్డెర కాలనీలో విద్యార్థులు లేక, గత ఏడాది మూతబడిన ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభం కాగ రాంపూర్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో 15మంది, కొంపల్లి పాఠశాలకు ఏడుగురు విద్యార్థులు ప్రవేశం పొందినట్లు మండల విద్యాధికారి ఎస్.జయసింహరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించారు. కాగ మండల వ్యాప్తంగా ప్రారంభం అయిన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం అందజేశారు.

'అర్బన్‌పార్క్‌ల ఏర్పాటుతో ఆహ్లాదం'

మల్యాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అహ్లాదం అందించడానికే అటవిశాఖ అధ్వర్యంలో అర్బన్‌పార్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అటవిశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సి.సువర్ణ తెలిపారు. కొండగట్టులో ఏర్పాటు చేస్తున్న అర్బన్‌పార్క్‌ను గురువారం అటవిశాఖ అధికారులతో కలిసి గజేబో, వాచ్‌టవర్ ఇతర నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరిత గతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. కొండగట్టు అంజనేయస్వామి దర్శనంకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదం పంచడానికి కొండపైన గల వైజంక్షన్ ప్రాంతంలో అర్బన్‌పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో మరింతగా ఆకట్టుకునే సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. చీఫ్ కన్జర్వేటర్ వెంట బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్, జిల్లా అటవి అధికారి రవిప్రసాద్, ఎఫ్ఆర్‌వో మొయినొద్దీన్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ఆర్.మౌనిక, ఎఫ్‌బీవో ఈ.ప్రవీణ్‌కుమార్, కొడిమ్యాల రేంజ్ పరిధిలోని అటవి సిబ్బంది పాల్గొన్నారు.

బంధువుకు భోజనం తీసుకెళ్తూ..
అనంతలోకాలకు

● ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

● దంపతుల మృతి..


పుష్పలీల(ఫైల్)


రామస్వామి(ఫైల్)

శంకరపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో ఉన్న బంధువుకు భోజనం తీసుకెళ్లడానికి వెళ్తున్న భార్యాభర్తల ద్విచక్రవాహనాన్ని శంకరపట్నం మండలం కాచాపూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తవరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంతుపల్లికి చెందిన తాటికొండ రామస్వామి(68), భార్య తాటికొండ పుష్పలీల(65)తోకలిసి ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ ఆస్పత్రిలో ఉన్న బంధువుకు భోజనం ఇచ్చి పరామర్శించేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో కాచాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి మొలంగూర్-వీణవంక రోడ్‌లో ఆముదాలపల్లివైపు రోడ్డు మూలమలుపు తిరుగుతుండగా వారి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో పుష్పలీల అక్కడికక్కడే మృతి చెందింది. రామస్వామికి తీవ్రగాయాలు కాగా హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి ఆయనను మెరుగైనవైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం ఎస్సై కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదసంఘటనపై విచారణ చేపట్టారు. పుష్పలీల మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

● స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..

ప్రమాదాలు జరుగుతున్న ఈ స్థలంలో అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కాచాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో ఇదేస్థలంలో కాచాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి సుధాకర్‌రెడ్డి తనభార్యతోకలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగావచ్చిన వాహనం ఢీకొట్టడంతో సుధాకర్‌రెడ్డి మృతిచెందిన విషయాన్ని గుర్తు చేశారు.

వరకట్న వేధింపులు భరించలేక
వివాహిత బలవన్మరణం


స్వప్న(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్‌లో అత్తవారింటి వేధింపులు భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఓ వివాహిత ఆత్మహత్యచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, ఎల్ఎండీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన గూళ్ల వెంకటేష్‌కు, పిట్టల స్వప్న(30)తో 10సంవత్సరాలక్రితం వివాహం జరిగింది. వివాహం సందర్భంగా 10తులాల బంగారం, 5లక్షల నగదు వరకట్నంగా ఇచ్చారు. పెళ్లి జరిగిన మొదటి సంవత్సరం నుంచి స్వప్నకు తనభర్త వెంకటేష్ కుటుంబసభ్యులనుంచి అదనపువరకట్న వేధింపులు ప్రారంభమయ్యాయి.స్వప్నను భర్తవెంకటేష్ గతంలో చాలా సార్లు వేధింపులకు గురిచేస్తూ ఇంట్లో నుంచి బయటకు పంపించాడు. దీంతో పలుదఫాలు పెద్దమనుషుల సమక్షంలో భర్త వెంకటేష్‌ను మందలించారు. అయినప్పటికీ వేధింపులు తగ్గలేదు. దీంతో భరించలేక స్వప్న తనతల్లిగారింటికి వెళ్లిపోయింది. తరువాత కొన్నినెలల తరువాత వేంకటేష్ తనభార్య స్వప్నను ఇంటికి తీసుకువచ్చాడు. తిరిగి బుధవారం ఈనెల11వతేదిఇంట్లో వెంకటేష్‌తోపాటు అతని కుటుంబసభ్యులు స్వప్నతో గొడవలుజరిగాయి. దీంతో మనస్తాపం చెందిన స్వప్న ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తనకూతురు మృతికి భర్త వేంకటేష్‌తోపాటు అతని కుటుంబసభ్యులే కారణం అని స్వప్న తల్లిదండ్రులు ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం ఆరెపల్లి గ్రామంలో 45 వేల విలువైన మద్యంను బెల్ట్‌షాపు నిర్వహకుడి వద్ద పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరెపల్లికి చెందిన గుర్రం శ్రీనివాస్ కొంతకాలంగా అతని ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వచేసి మద్యం సిట్టింగ్‌లతో ఇబ్బంది కలిగిస్తున్నాడని గ్రామస్థులు డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. దీంతో వెంటనే వెళ్లి శ్రీనివాస్ ఇంటిలో వెదకగా ఇంటి వెనుకవైపున గడ్డివాములో 101 లీటర్ల మద్యం, ఒక ఫోన్ లభ్యమైందని తెలిపారు. అక్రమంగా బెల్ట్‌షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్న గుర్రం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ గ్రామస్థులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎక్కడి పనులు అక్కడే..

సుల్తానాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ఏడాది కావస్తున్నా పిల్లర్లకే పరిమితమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో భాగంగా రూ.18 కోట్లతో చేపట్టిన 14లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఆర్ నిర్మాణ పనులు పిల్లర్ల వరకే ఆగిపోయాయి. పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తీర్చాలనే ప్రయత్నం


పాడై పోతున్న ఐరన్ రాడ్స్

పనులు ప్రారంభించి ఏడాది..
పిల్లర్లకే పరిమితమైన వాటర్ ట్యాంక్

అలాగే ఉండిపోయింది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పదిహేను వార్డులుండగా జనాభాకు తగ్గట్టుగా రక్షిత మంచినీటి వ్యవస్థ లేదు. ప్రస్తుతం రోజు విడిచి రోజు ప్రజలకు తాగునీటి సరఫరా జరుగుతోంది.

రాష్ట్రమంతటా మిషన్ భగీరథ నల్లాల ద్వారా తాగునీటి సరఫరా అవుతున్నా సుల్తానాబాద్‌లో పాత పద్ధతి ద్వారానే సరఫరా అవుతుంది. గట్టేపల్లి మానేరు వాగు నుంచి అశోక్‌నగర్ బావి (సంప్) వరకు పైపులైన్ల ద్వారా నీరు వస్తుంది. అక్కడి నుంచి పట్టణంలోని వివిధ ట్యాంకులకు సరఫరా జరుగుతుంది. మిషన్ భగీరథ పైపులైన్ నీరు కూడా నేరుగా ట్యాంకుల నుంచి బావిలో పడతాయి. ఈ విధానంలో అనేక అవాంతరాలు ఎదురువుతున్నాయి. గట్టేపల్లి వద్ద గల బావుల్లో మోటార్లు కాలిపోవడం నీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఇబ్బందులను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ నిధులు రూ 18.40 కోట్లతో 14 లక్షల లీటర్ల సామ ర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని, పట్టణంలో కొత్త పైపులైను వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు భావించారు. శిలాఫలకాన్ని 7 ఆగస్టు 2024న ఎమ్మెల్యే విజయరమణారావు ఆవిష్కరించారు.పనులు మాత్రం ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. పట్టణంలో నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌లు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. మార్కండయ కాలనీలోని పెరికిగిద్ద ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ట్యాంక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా కేవలం పిల్లర్లకే పరిమితమయ్యాయి. పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు.


పునాదులకే పరిమితమైన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులు సీజ్

తిమ్మాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న నాలుగు విద్యాసంస్థల బస్సులను గురువారం రవాణాశాఖ అధికారులు పట్టుకొని సీజ్‌చేశారు. గురువారం నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు ప్రత్యేకంగా డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు, సిబ్బందితోకలిసి మూడు బృందాలుగా స్పెషన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో కరీంనగర్‌లోని రేకుర్తి, మంచిర్యాల రోడ్డు, సిరిసిల్ల రోడ్డు వద్ద తనిఖీల్లో నాలుగు విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్నట్లు తేలింది. దీంతో పట్టుకున్న నాలుగు విద్యాసంస్థల బస్సులను సీజ్ చేసి తిమ్మాపూర్ మండలకేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ డ్రైవ్‌లో ఫిట్‌నెస్‌తోపాటు ఇతర పత్రాలు లేకుండా విద్యా సంస్థల బస్సులను సీజ్ చేయడంతోపాటు విద్యాసంస్థలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు ఫిట్‌నెస్ చేయించుకోకుండా బస్సులను రోడ్లపైకి తీసుకురావద్దని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ విద్యాసంస్థలకు చెందిన 836బస్సులకు గాను 610బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ చేయించారని, ఇంకా 226బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ శ్రవంతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యాసంస్థల బస్సు పత్రాలను తనిఖీ చేస్తున్న డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి

హత్యాయత్నం కేసులో
నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

వేములవాడ టౌన్/బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష, 400 రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషనల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ గురువారం తీర్పు వెలువరించారు. వేములవాడ రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన వేములవాడ సుమ కొడుకు సాయిచరణ్ దసరా సందర్భంగా వేంకటేశ్వర ఆలయం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన కట్ట గంగరాజు అనేవ్యక్తి మద్యం మత్తులో సిమెంట్ ఇటుకలతో చరణ్‌పైదాడి చేశాడు. దీంతో చరణ్ తల్లి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటిఎస్ఐ శ్రీనివాస్ హత్యాహత్నం కేసునమోదు చేశారు. అప్పటి సీఐలు నవీన్‌కుమార్, బన్సీలాల్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా కేసు పూర్వపరాలను పరిశీలించన అసిస్టెంట్ సెషన్‌కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ జాదవ్ నిందితుడికి ఐదు సంవత్సరాల జైలుశిక్షతోపాటు 400 రూపాయల జరిమానా విధించారు. నిందితలకు శిక్షపడేలా కృషిచేసిన సంబంధిత సీఐలను, కోర్టుకానిస్టేబుల్‌ను ఎస్పీ అభినందించారు.

అనుమతులు లేని
పెట్రోల్ బంక్ సీజ్

మానకొండూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ సంస్థ పెట్రోల్ బంక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ముంజంపల్లి పంచాయతి కార్యదర్శి జీపీసిబ్బందితో కలిసి గురువారం సీజ్ చేశారు. టీఎస్‌బీపాస్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని గతంలోనే మూడుసార్లు బంక్ నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చినా నిర్మాణాన్ని ఆపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

బ్లాక్‌ఫిల్మ్ అతికించిన 23 కార్లకు జరిమానా

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్‌పోలీసులు గురువారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్‌ను అతికించిన 23కార్లకు జరిమానా విధించారు. ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద ట్రాఫిక్‌సీఐ పర్శ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కారుఅద్దాలకు పరిమితికి మించి మసకబారే విధంగా బ్లాక్ ఫిల్మ్‌ను అతికించినట్లు టింట్ మీటర్ ద్వారా పరీక్షించి జరిమానాలు విధించారు. అనంతరం కారు యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పర్శ రమేష్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాల అద్దాలకు బ్లాక్‌ఫిల్మ్‌లు అతికిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పకుండా పాటించాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ ఇషాక్ అహమ్మద్, ఆర్ఎస్ఐ గణేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కారు అద్దాలను టింట్ మీటర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్ఐలు

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా


సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అధ్వర్యంలో కార్మికులతో కలిసి నాయకులు ధర్నా చేసి బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవాలని కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీడికార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బీడీ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. కార్మికుల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి, నాయకులు , కార్మికులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం ఆరెపల్లికి చెందినవీణవంక సంతోష్ మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. సంతోష్ తనవ్యవ సాయభూమిని పక్కనవారు అక్రమంగా దున్ని చంపుతానని బెదిరించడంతో మనస్తాపంతో ఆత్మహత్యకుయత్నించి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. పొలంవద్దనే పురుగు మందుతాగిన సంతోష్ సెల్ఫీవీడియోతీసి తాను చనిపోతున్నానని తనఫోన్‌లో స్టేటస్‌గా పెట్టుకోగా కుటుంబసభ్యులు గుర్తించి అతన్ని ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. అక్రమంగా భూమిలోకి వచ్చి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుసంతోష్ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబ కలహాలతో
ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పండుగు చక్రపాణి(40) అనే ఆటో డ్రైవర్ క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం చక్రపాణి ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబకలహాలతో గురువారం వ్యవసాయ బావివద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలోఉన్న చక్రపాణిని ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిమండలం ఖాజీపూర్ వాగు, కరీంనగర్‌రూరల్ మండలం ఇరుకుల్ల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఓర్సుఅశోక్, తిరుపతిలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మంద కృష్ణ సన్మాన సభను విజయవంతం చేయాలి

● వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు సుధాకర్

సిరిసిల్ల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న హైదరాబాద్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి దేశంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా వికలాంగుల సమాజాన్ని విస్మరించాయన్నారు. ఉద్యమ నేత మంద కృష్ణమాదిగ అట్టడుగున ఉన్న వికలాంగుల సమాజాన్ని చేరదీశారన్నారు. కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డును ప్రకటించిందన్నారు. వికలాంగుల పక్షాన ఈనెల 19న హైదరాబాద్‌లో మంద కృష్ణ ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వికలాంగులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళన సభను విజయ వంతం చేయాలని కోరారు. సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జోగని తిరుపతి, ఉపాధ్యక్షుడు తలారి సురేష్, నాయకులు మెరుగు రాములు పీర్లవంచ నరసయ్య, పెరుమాండ్ల సాయికుమార్, తాటి బెల్లి దుర్గయ్య, శోభ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పురుగుల మందు తాగి
నవ వరుడు ఆత్మహత్య

● ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి


శ్రీకాంత్(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన శ్రీకాంత్(30) అనే నవవరుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. రేణికుంట గ్రామానికిచెందిన పెసర శ్రీకాంత్‌కు గతనెల మే 16న పూసాల గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. పెళ్లయిన వారం వరకు రేణికుంటలోనే ఉన్న ఉషారాణి తన పుట్టిల్లు పూసాల గ్రామానికి వెళ్లింది. తరువాత శ్రీకాంత్ కూడా ఉషారాణి వాళ్ల ఇంటికి వెళ్లి రేణికుంటకు వచ్చాడు. పుసాలకు వెళ్లి వచ్చినప్పటి నుంచి శ్రీకాంత్ దిగులుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 2న ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోల్‌సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బాపూజీనగర్‌లోని గురువారం ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21400, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాపూజీనగర్‌లోని ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసినట్టు ఆయన తెలిపారు. పేకాట ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఆరు రోజుల జైలు శిక్ష

హుజూరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన లారీ డ్రైవర్‌కు హుజూరాబాద్ జడ్జీ ఆరు రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్‌లో గురువారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా జమ్మికుంట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడిగే భిక్షపతి అనే లారీడ్రైవర్ మద్యం తాగి లారీ నడుపుకుంటూ వస్తున్నాడు. పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో లారీ డ్రైవర్ భిక్షపతిని జడ్జీ ముందు హాజరు పరుచగా ఆరు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

రుద్రంగి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలకేంద్రంలో ఫర్టిలైజర్‌షాపుల్లో మండల వ్యవసాయశాఖ అధికారులు ప్రియదర్శిని, సంజీవ్, ఎస్ఐ మోతిరామ్ గురువారం ఆకస్మికతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాషాపుల్లో స్టాక్‌రికార్డులను పరిశీలించడంతోపాటు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే వ్యాపారులపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా నకిలీవిత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే రైతులు, ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, వ్యవసాయఅధికారి కార్యాలయంలో సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



రుద్రంగిలో ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు

మహిళ వీరంగం

సిరిసిల్ల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో గురువారం రాత్రి మద్యం మత్తులో మహిళ వీరంగం సృష్టించింది. సిరిసిల కూరగాయాల మార్కెట్లో కూరగాయలు అమ్ముకుంటూ ఇద్దరు కొడుకులను పోషించుకునే మహిళ మద్యానికి బానిసైంది. భర్తకు దూరమై మద్యంసేవిస్తూ తరుచూ మార్కెట్లో గొడవపడుతుంటుంది. గురువారం రాత్రి మహిళ పెద్ద కుమారుడు ఓ ఇంట్లో దొంగతనం చేయగా ఆ ఇంటి యజమాని స్థానిక మున్సిపల్ సమీపంలో పట్టుకొని మందలించి వదిలేశాడు. ఆ బాలుడు తల్లికి జరిగిన విషయం చెప్పడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ మహిళ మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాన్‌షాప్ వద్ద ఉన్న ఇంటి యజమానితో గొడవకు దిగింది. అంతటితో ఆగకుండా అతడిపై దాడిచేసి ఎలాంటి సంబంధంలేని పాన్‌షాప్‌లోని అద్దాలను ధ్వంసం చేసి వీరంగం సృష్టించడంతో జనం మహిళకు దేహశుద్ధి చేశారు.

పిడుగుపాటుతో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

మెట్‌పల్లి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామంలో గురువారం ఉదయం పిడుగుపాటుతో పాక్షికంగా ఇల్లు దెబ్బతింది. గ్రామంలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. గ్రామంలోని జెల్ల మహేష్ ఇంటి దాబాపై పిడుగు పడడంతో స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మెట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్లు పరిశీలించారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వర్‌రావు


తుమ్మల నాగేశ్వరరావు

కరీంనగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా రాష్ట్ర వ్యవసాయశాఖ, మార్కెటింగ్, చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నుంచి ఇప్పటి వరకు 16 నెలలపాటు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కరీంనగర్ ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించారు. ఆయన స్థానంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నియమించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2సార్లు మాత్రమే ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షజరిపారు. కాగా ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు కొందరు సీనియర్ మంత్రులను ఏ జిల్లాకుకూడా ఇన్‌చార్జిగా నియామకం చేయలేదు. ఇన్‌చార్జిమంత్రి పట్ల విముఖత చూపటమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలు కరీంనగర్ జిల్లాలో ఇంత వరకు ఏర్పాటు కాలేదు. కొత్తగా బాధ్యతలు తీసుకుంటున్న ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అయినా త్వరగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇతర జిల్లాల్లో ఇందిరమ్మ కమిటీలు పూర్తి అయి లబ్ధిదారుల ఎంపిక కూడా చాలా జిల్లాల్లో పూర్తికాగా ఇక్కడమాత్రం కమిటీల ఏర్పాటులోనే తీవ్రజాప్యం జరుగుతున్నది.

రైతులు నష్టపోకుండా విత్తన చట్టం

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

కరీంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు, పంటలు సాగుచేస్తున్న రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో విత్తనచట్టం ముసాయిదాను రూపొందిస్తుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని కేడీసీసీబీ కాన్ఫరెన్స్ హాల్‌లో నూతన విత్తనంచట్టం ముసాయిదాను రూపొందించేందుకు విత్తన కంపెనీ, ఆర్గనైజర్స్, డీలర్లు, రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల అభిప్రాయ సేకరణకు రాష్ట్రస్థాయి విత్తన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని కఠిన విత్తన చట్టాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తా నని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులు డి నరసింహారెడ్డి, పుష్పరాణి, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఉషారాణి, శ్రావణి, విజయభాస్కర్, మధుకర్, కేవీకే జమ్మికుంట నుంచి విజయ్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏలు, ఏవోలు, రైతులు, ఉత్పత్తిదారులు, ఆర్గనైజర్లు, డీలర్లు పాల్గొన్నారు.

రైతు నేస్తం విస్తరణకు పచ్చజెండా


కొత్తపేట రైతు వేదిక

అధిక దిగుబడులు సాధించేలా కార్యక్రమాలు

జగిత్యాల జిల్లాలో ఇప్పటికే 19 రైతు వేదికల్లో ఏర్పాటు

తాజాగా మరో 33 కేంద్రాలు మంజూరు

జగిత్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతు నేస్తం పేరుతో సాగులో మెళకువలు, సూచనలు అందించే ప్రయత్నాలు మరింత విస్తరించేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. జగిత్యాల జిల్లాలో గతంలో 19 రైతు నేస్తం కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరిన్ని రైతు నేస్తం కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన రైతు వేదికల్లో దృశ్య, శ్రవణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. పంట ఉత్పత్తులను పెంచే విధంగా నిపుణులు సూచనలు ఇస్తున్నారు. అన్ని గ్రామాల రైతులు కార్యక్రమానికి హాజరై వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి పలువురు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆధునిక వ్యవసాయ విధానాలతో పాటు సస్య రక్షణపై సలహాలు ఇస్తున్నారు. ఈ విధానం రైతులకు ప్రయోజనకరంగా ఉండడంతో మరిన్ని రైతు నేస్తం కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో అధికారుల ప్రతిపాదనల మేరకు తాజాగా 33కేంద్రాలు మంజూర య్యాయి. వీటిని ఏర్పాటు చేసే ప్రక్రి యలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపిక చేసిన రైతు వేదికల్లో సామగ్రి అమర్చాల్సి ఉంది.


రైతు నేస్తం కేంద్రంలో సమావేశంలో పాల్గొన్న రైతులు, అధికారులు

సందేహాల నివృత్తికి..

జిల్లాలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వంగ డాల ఎంపిక, కలుపు నివారణ, అధికా ర వర్షాల వేళ పంటల వారీగా తీసుకోవాల్సిన చర్యలు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్నారు. చిరు ధాన్యాలు, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు విధానాలను రైతులు అడిగి తెలుసుకొని, సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. సీజన్‌కు అనుగుణంగా పశువులకు అందించాల్సిన టీకాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు వచ్చే రాయితీలు, దరఖాస్తు విధానాలను వ్యవసాయ అధికారులు తెలియజేస్తు న్నారు. తాజాగా మరిన్ని రైతు నేస్తం కేంద్రాలను విస్త రించడంతో మరింత మంది రైతులకు సేవలు అందు బాటులోకి వచ్చే ఆస్కారముంది.

లక్ష్యాలివే..

జిల్లా వ్యాప్తంగా 71 క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించి వాటి ద్వారా పలు రకాల సలహాలు ఇస్తున్నారు. తక్కువ పెటుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు ఆర్జించే విధంగా రైతుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో రైతునేస్తం ఒకటిగా ఉంటోంది. దృశ్య, శ్రవణ సేవల విస్తరణకు వ్యవసాయంతో పాటు దానికి అనుబంధంగా ఉండే ఉద్యాన, మత్స్య, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, నీటి పారుదల శాఖలకు సంబంధించి సలహాలు అందిస్తున్నారు. రైతు నేస్తం ద్వారా కర్షకులకు అధికారులు పలు రకాల ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. జిల్లాకు మంజూరైన రైతు నేస్తం యూనిట్లను రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తారు. బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సాయంతో దృశ్య, శ్రవణ విధానం కొనసాగుతుంది. వీడియో కాన్ఫరెన్స్ సౌక ర్యం కల్పిస్తారు. రైతు నేస్తం నిర్వ హణ మొత్తం ఏఈవోలకు అప్పగిం చారు. టీవీ, బ్యాట రీ తదితర విలువైన పరికరా లు కేంద్రాల్లో ఉంటాయి.

జిల్లాలో రైతు నేస్తం మంజూరైన కేంద్రాలివే...

మండలం	రైతు వేదికలు
జగిత్యాల రూరల్...	కల్లెడ, లక్ష్మీపూర్
సారంగపూర్...	కోనాపూర్
బీర్‌పూర్...	మంగేళా
రాయికల్...	భూపతిపూర్, దర్మాజీపేట
కోరుట్ల...	పైడిమడుగు,మోహన్ రావుపేట
మెట్‌పల్లి...	వెల్లుల్ల, మెట్‌పల్లి
మల్లాపూర్...	ముత్యంపేట, మొగిలిపేట
ఇబ్రహీంపట్నం	గోదూర్,వర్షకొండ
కథలాపూర్...	భూషణ్‌రావుపేట, బొమ్మెన
మేడిపల్లి...	పోరుమళ్ల
బీమారం...	మన్నెగూడెం, గోవిందారం
మల్యాల...	మానాల, నూకపల్లి
కొడిమ్యాల...	తిరుమలాపూర్, కొడిమ్యాల
ధర్మపురి...	జైనా, ధర్మపురి
బుగ్గారం...	బుగ్గారం
ఎండపల్లి...	గుల్లకోట, కొత్తపేట
గొల్లపల్లి....	వెనుగుమట్ల, ఇబ్రహీంనగర్
పెగడపల్లి...	ఎల్లాపూర్, నంచర్ల
వెల్గటూరు...	చెగ్యాం


సద్వినియోగం చేసుకోవాలి

భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జగిత్యాల



రైతు నేస్తం వేదికల్లో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన, పశు సంవర్థక, మత్స్య శాఖ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో కార్యక్రమానికి హాజరయ్యే రైతుల అన్ని రకాల సందేహాలు నివృత్తి అవుతున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన 33 గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయిస్తున్నాం.

జూలైలో తిరుపతికి ప్రత్యేక రైళ్లు



కరీంనగర్ రూరల్, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా జూలై మాసంలో కరీంనగర్‌నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు నడిపించేందుకు దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. 6 నుంచి 27వ తేదీ వరకు రైలు నెం. 02761 తిరుపతి నుంచి కరీంనగర్‌కు నాలుగు ట్రిప్పులు, 7జూలై నుంచి 28 వరకు రైలు నెం. 02762 కరీంనగర్ నుంచి తిరుపతికి నాలుగు ట్రిప్పులు నడిపించనున్నారు. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని నెలరోజుల పాటు ప్రత్యేకరైళ్లు నడుస్తాయని కరీంనగర్ స్టేషన్‌మేనేజర్ రవీందర్ తెలిపారు. రెగ్యులర్‌గా కరీంనగర్ నుంచి ప్రతి గురు, ఆదివారాల్లో తిరుపతికి వెళ్లే రైళ్లతోపాటు ఈ ప్రత్యేకరైళ్లను అదనంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. జూలైలో 6, 13, 20, 27 తేదీల్లో తిరుపతి నుంచి కరీంనగర్‌కు, 7, 14, 21, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి తిరుపతికి రైళ్లు నడుస్తాయని తెలిపారు.

● ప్రత్యేక రైళ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ నుంచి తిరుపతి , తిరుపతి నుంచి కరీంనగర్‌కు వెళ్ళే రైలును ప్రతి రోజు నడిపించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తాను పలుమార్లు విజ్ఞప్తి చేశానని, స్పందించిన ఆయన ప్రత్యేక రైళ్లు మంజూరు చేశారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు వేసిన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కొండగట్టుకు నిరంతర విద్యుత్

మల్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో నిరంతర విద్యుత్‌సరఫరా కోసం సబ్‌స్టేషన్‌లో గురువారం ట్రాన్స్‌కోఅధికారులు 5మెగాఓల్ట్ ఆంప్స్ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీనివలన ఆంజనేయస్వామి దేవస్థానంతో పాటు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని ఎస్ఈ శాల్యానాయక్ తెలిపారు. కార్యక్రమంలో డీఈలు రాజిరెడ్డి, రవీందర్ ఏడీఈలు మహేందర్, రాజు, అనిల్‌కుమార్,ఏఈలు పాల్గొన్నారు.

మానువాడ సొసైటీపై ఫిర్యాదు

బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని మానువాడ సహకార సంఘం సొసైటీపై వైస్ చైర్మన్ బొల్లం జీవన్‌రెడ్డి జిల్లా డీసీవోకు గురువారం ఫిర్యాదు చేశాడు. సొసైటీ ద్వారా అందించిన రుణాలు, లావాదేవీల అవకతవకలపై శాఖాపరమైన విచారణ జరపాలన్నారు. సొసైటీ చైర్మన్ దుర్గారెడ్డి సంఘం సమావేశాలను సైతం నిర్వహించడం లేదన్నారు. ఫిర్యాదు అంశాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నాడు.

కన్నుల పండువగా పోచమ్మ బోనాలు


సిరిసిల్ల చిన్నబోనాలలో పోచమ్మ బోనాలు


బోనాల ఊరేగింపులో నృత్యాలు

సిరిసిల్ల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామంలో గురువారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నబోనాల గ్రామంలోని అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని కులాలకు చెందిన ప్రతీ కుటుంబం నుంచి మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఒగ్గుడోలు, డప్పుచప్పుళ్లతో ఊరేంగిపుగా దేవాలయాన్ని చేరుకున్నారు. అనంతరం బోనాలతో నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్, మాజీఎంపీపీ దడిగెల కమలాబాయ్, మాజీ వైస్‌ఎంపీపీ చల్లాహరికృష్ణ, గ్రామస్థులున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో గురువారం పలు సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాజరాజేశ్వర మూన్నురుకాపు సంఘం ఆధ్వర్యంలో డప్పు చప్పుల మధ్య పోచమ్మ ఆలయంవరకు మహిళలు బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకు న్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్ పల్లెగ్రామంలో యాదవసంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. యాదవులు ప్రతి ఇంటికి బోనంతీసి ఆటపాటతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మీరాల శ్రీనివాస్ యాదవ్, అంబటి కిషన్, జంగం శ్రీనివాస్ కొండవేని కిషన్, కుక్కల రాములు, గొట్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 86.85 లక్షలు


రాజన్న హుండీ డబ్బులను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు

వేములవాడ కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయం 86,85,300 రూపాయలు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య హుండీలను ఆలయ ఉద్యోగులు, సిబ్బంది గురువారం విప్పి లెక్కించారు. రాజన్న ఆలయ 15రోజుల హుండీల ఆదాయం 8685,300 రూపాయలు రాగా, 83గ్రాముల బంగారం, ఐదు కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు, హుండీ లెక్కింపులో ఈవో వినోద్‌రెడ్డి, ఏసీ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు


టీజీఎస్‌ఆర్‌టీసీ మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

భగత్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్క రించాలని టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అన్నారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్-సీఐటీయూ జిల్లా నాల్గవమహాసభలు నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జెండాను ఆవిష్కరించి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో కార్మికులపై పనిఒత్తిడి పెరిగిపోయిందన్నారు. కండక్టర్లను డ్రైవర్లను పనిఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ నూతన అధ్యక్షునిగా రాపల్లిరాజయ్య, కార్యదర్శిగా వీరగోని శ్రీనివాస్, ప్రచార కార్య దర్శిగా కడారి అంజిరెడ్డి, జాయింట్‌సెక్రెటరీగా ములుగూరి రాజయ్య, కోశాధికారి ఎం నాగరాజు, గౌరవాధ్యక్షులుగా ఎద్దరమేష్‌ను ఎన్నుకున్నారు.

మిడ్ మానేరు డ్యాంను పరిశీలించిన కేంద్ర అధికారులు


మిడ్ మానేరు డ్యాంను పరిశీలిస్తున్న అధికారులు

బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మానువాడ మిడ్‌మానేరు ప్రాజెక్టును సెంట్రల్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ జాయింట్ సెక్రెటరీ సెంతల్ రాజన్ చొక్కాలింగం ఆధ్వర్యంలో అధికారులు గురువారం పరిశీలించారు. ప్రాజెక్టువివరాలు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభంనుంచి ఇప్పటివరకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. నీటిని ఏఏ ప్రాంతాలకు తరలిస్తున్నారో రిపోర్ట్ తీసుకున్నారు. పూర్తి వివరాలను పరిశీలించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సైంటిస్ట్ సుధీర్ కుమార్, కృష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ ఈఈ ధీరజ్ సింఘాల్, ప్రాజెక్ట్ ఈఈ జగన్, డీఈలు రాజు, శ్రీనివాస్, ఏఈలు రాధిక, అనుపమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగకు మూడు సంవత్సరాల జైలు

ఇబ్రహీంపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్తెక్కపల్లి గ్రామంలో 2021లో జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించిన కేసులో నిందితుడికి మూడుసంవత్సరాల జైలుశిక్షను జిల్లా సెషన్స్ కోర్టు నాయమూర్తి నారాయణ గురువారం విధించినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. మండలంలోని సత్తెక్కపల్లి గ్రామంలో 2021 సంవత్సరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌తీగ, ఆయిల్ దొంగిలించినకేసులో విద్యుత్‌శాఖ ఏఈ సంక త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటిపోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా సింగరాయకొండకు చెందిన పల్లిపాటి ఏసుదాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులోసాక్షులను విచారించిన న్యాయమూర్తి నారాయణ నిందితుడు ఏసుదాసుకు మూడు సంవత్సరాల జైల్‌శిక్ష రూ.3000జరిమాన విధించినట్లుఎస్ఐ తెలిపారు.

యాదవులపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న సీఎం

● యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్

సిరిసిల్ల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదవులపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని యాదవ హక్కుల పోరాటసమితి రాష్ట్రఅధ్యక్షుడు కొక్కుల దేవేందర్‌యాదవ్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రతి క్యాబినెట్‌లో యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. తెలంగాణ వచ్చాక కూడా రెండుపర్యాయాలు యాదవ్‌లకు మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం యాదవులను నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కావాలనే యాదవులను అణచివేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు కావస్తున్నా యాదవులకు మంత్రి పదవి ఇవ్వలేదని, కార్పొరేషన్ ప్రకటించి ఇప్పటి వరకు చైర్మన్, డైరెక్టర్ల పేర్లు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా యాదవులకు ఎక్కడకూడా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాష ప్రకారం యాదవులకు 16నుంచి 18శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మిగిలిఉన్న మంత్రివర్గ విస్తరణలో యాదవసామాజిక వర్గానికి చెందిన వారికి ఎమ్మెల్సీపదవి ఇచ్చి మంత్రిగా అవకాశం కల్పించకపోతే గాంధీభవన్‌కు వచ్చి సత్యాగ్రహ దీక్షలను చేపడతామని అన్నారు. సమావేశంలో యాదవ హక్కులపోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి వీరబోయిన మల్లేశంయాదవ్, నాయకులు మెండే శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌యాదవ్, స్వామి యాదవ్, కృష్ణకాంత్‌యాదవ్, చంద్రశేఖర్‌యాదవ్, మారవేణి రాజుయాదవ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నిలిచిన వర్షం నీరు

● ఇబ్బందులు పడిన విద్యార్థులు

మల్లాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలో గురువారం కురిసిన వర్షానికి పునరావాసగ్రామం అయిన రత్నాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వరదనీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రత్నాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన వరద నీరు

శాతవాహనలో నూతన ఎంఫార్మసీ కోర్సు

గణేశ్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని మానేరుడ్యాం పక్కనఉన్న ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో నూతన ఎంఫార్మసీ కోర్సులు 2025-26 విద్యాసంవత్సరంలో ప్రారంభించడానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్ కుమార్ తెలిపారు. ఎంతోకాలంగా నూతనకోర్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఫార్మసీ కళాశాలలో ఫార్మకాలజీ, ఫార్మాసిటిక్స్, ఫార్మసిటికల్ అనాలసిస్ విభాగాలలో 15సీట్లు చొప్పున మొత్తం 45సీట్లకు అడ్మిషన్స్‌కి అనుమతి లభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీశైలం, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్ ఉపకులపతి ఉమేష్ కుమార్‌ని కలిసి అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో కోతుల బెడద


దుర్శేడ్‌లో ఓ ఇంట్లో నుంచి బయటకు వస్తున్న కోతులు

కరీంనగర్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో గుంపులుగా వచ్చి పెంకుటిల్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి వస్తువులను ఎత్తుకెళ్లిపోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులపైకి కోతులు దాడికి ప్రయత్నిస్తున్నాయి. గురువారం దుర్శేడ్ గ్రామంలో వానరం గుంపుగా వచ్చి పెంకుటిళ్లపై ఉన్న గూనలను చిందర వందర చేశాయి. మొగ్దుంపూర్, దుర్శేడ్, ఎలబోతారం, నగునూర్, వల్లంపహాడ్ గ్రామాల్లో కొందరిపై కోతులు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

● అవీ.. ఇవీ

● గొల్లపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని డిప్యూటి డీఎంహెచ్‌వో డా. శ్రీనివాస్ వైద్యారోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. గురువారం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు.

● పెగడపల్లి: మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ మండల నాయకులు కొప్పుల ఈశ్వర్ రాజకీయ ప్రయాణం ఒక మహా ప్రస్థానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు శోభాసురేందర్ రెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, మాదారపు కరుణాకర్ రావు పాల్గొన్నారు.

● సారంగాపూర్: మండలంలోని బట్టపెల్లి గ్రామంలో గురువారం గ్రామస్థులు గ్రామ శివారులో ఉన్న భీమన్న దేవునికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బల్యారి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

● వెల్గటూర్: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జీవిత చరిత్రపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నూతి మల్లన్న రచించిన ఒక ప్రస్థానం పుస్తకాన్ని వెల్గటూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లూరి. రాంచందర్ గౌడ్ నివాసంలో నాయకులు గురువారం ఆవిష్కరించారు.

● ధర్మపురి : మండలంలోని జైనా జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఏకరూప దుస్తులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్ పంపిణీ చేశారు.

●మైతాపూర్ ఉన్నత పాఠశాలలో గురువా రం విద్యార్థులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

● రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామంలో గురువారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

● రాయికల్: రాయికల్ పట్టణ బీజేపీ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి గురువారం నూతన కార్యవర్గాన్ని నియమించారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా బన్న సంజీవ్, కునారపు భూమేష్, ఉపాధ్యక్షులుగా తోపారపు ఆశన్న, అల్లె నర్సయ్య, ఎల్లాగౌడ్, కడార్ల శ్రీనును ఎన్నుకున్నారు.

●మల్యాల: నూకపల్లిలో గ్రామస్తులు బోనాల వేడుకలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి మరుసటి రోజు గ్రామ దేవతలు పోచమ్మ, పెద్దమ్మ, మహాలక్ష్మీ, ఇందూరు పోచమ్మ, కొండ పోచమ్మ ఆలయాలకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు.

●కొడిమ్యాల: నాచుపల్లి గ్రామానికి చెందిన బొడ్డెల్లి ఆంజనేయులు కూతురు కృతిక 16 ఏళ్ళ అనే బాలిక తలసేమియాతో బాధపడుతుండగా కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు గురువారం వైద్య ఖర్చులకు 10వేల రూపాయల నగదును కుటుంబ సభ్యులకు అందించారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవాలి

జగిత్యాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులకు ట్రాపిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో పోలీస్ పాఠశాల.. యువ పౌరుల కోసం రోడ్డు భద్రత అనే ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ గురువారం ప్రారంభించారు. స్థానిక ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో, క్షేత్ర స్థాయిలో హాజరైన విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పిల్లలు మన భవిష్యత్ అని వారికి ఇపుడు అవగాహన కల్పిస్తేనే రేపటి సమాజం మరింత భద్రమవుతుందన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పాఠశాల అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించి నిత్యం క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు ట్రాపిక్ నియమ నిబంధలనలపై అవగాహన కల్పించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో రోడ్డు నియమాల పట్ల చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టౌన్, ఐటీ కోర్ ఇన్స్‌పెక్టర్లు కరణాకర్, రఫీక్ ఖాన్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశం ఉన్నారు.



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు

జగిత్యాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పురోగతిపై పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గడిచిన ఐదు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 3,200 మంది వ్యక్తులను పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టుబడ్డ వారిని కోర్టుల్లో ప్రవేశ పెట్టగా పలువురికి న్యామూర్తులు జరిమానాలతో పాటు జైలు శిక్షలు విధించారన్నారు.

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్కువసార్లు పట్టుబడితే లైసెన్స్ రద్దు చేసేలా రావాణా శాఖకు సిఫారసు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిమయ నిభందనలు పాటించి పోలీస్ శాఖకు సహకారం అందించాలని కోరారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

బీర్‌పూర్,జూన్ 12(ఆంధ్రజ్యోతి):అసైండ్ భూముల పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి హద్దులను అసైండ్ కమిటి సర్వే చేయించి సమస్యలు లేకుండా చూస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని మంగేళ, చెర్లపెల్లి గ్రామాలలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ గ్రామ సభలో బాగంగా చెర్లపెల్లిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఆర్ఐ రాహుల్ పాల్గొన్నారు.

●కొడిమ్యాల: తిప్పయ్యపల్లి గ్రామంలో భూ భారతి గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ప్రజల నుండి 74దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ తెలిపారు.

●ధర్మపురి: ధర్మపురి మండలంలోని ఆరెపల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్బంగా ధర్మపురి మండల ఇంచార్జ్ తహసీల్దార్ సుమన్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

●రాయికల్: భూపతిపూర్, రామాజీపేట గ్రామాల్లో తహసీల్దార్ నాగార్జున భూ భారతి సదస్సులు నిర్వహించారు.

●పెగడపల్లి : భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. నామాపూర్, సుద్దపల్లి గ్రామాలలో గురువారం రెవెన్యూ అధికారులు భూ భారతి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించగా, మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ రెండు గ్రామాలలోని సదస్సులలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో తహసీల్దార్ బి.రవీందర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ, గిర్దావర్‌లు పాల్గొన్నారు.

●గొల్లపల్లి : గొల్లపల్లి మండలం వెన్గమట్ల గ్రామంలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ కట్కం వరందన్ నిర్వహించారు.

'సింగిల్‌విండోను బద్నాం చేసే కుట్ర'

కొడిమ్యాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాన్ని, కొడిమ్యాల సింగిల్‌విండోను బద్నాం చేయటానికి కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన వెల్గటూరు నాయబ్ తహసీల్దార్ హరీష్ రావు అసత్య ఆరోపణలు చేస్తున్నాడని కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ హరీష్‌రావుకు సుమారు 25ఎకరాల పైచిలుకు వ్యవసాయ భూమి ఉండగా కొడిమ్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహించు రామకిష్టాపూర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి గత నెల 26న 800 క్వింటాళ్ళ వరి ధాన్యాన్ని తీసుకవచ్చాడన్నారు. గత 25వరకు 663మంది రైతుల నుండి 60వేల క్వింటాళ్ళ వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత అధికారులు కేంద్రాన్ని మూసివేసి కొనుగోళ్ళు నిలిపివేశారన్నారు. కేంద్రానికి ఆలస్యంగా వరిధాన్యం తీసుకవచ్చిన రైతు కొనుగోలు చేయక పోతే సిబ్బందిని బెదరించాడన్నారు. అదె సమయంలో సెంటర్ అధికారులు, సిబ్బంది అప్పటి తహసీల్దార్, డీసీవో మనోజ్‌కుమార్‌కు సమాచారం అందించిట్లు తెలిపారు. ప్రతి పంటకు ధాన్యం కొనుగోలు సమయంలో ఆలస్యంగా దాన్యం తీసుకవచ్చి తమను బెదిరిస్తున్నట్లు సిబ్బంది తెలిపారన్నారు. గత సంవత్సరం డిసెంబరు 3న సెంటర్ మూసివేయగా 18న ధాన్యం తీసుకరాగా వెల్లిపోయిన హమాలీలను తీసుకవచ్చి సుమారు 1000క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 663మంది రైతుల నుండి 60వేల క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి గంగాధర్, పర్సన్ ఇంచార్జులు పాదం శ్రీనివాస్, ఈరు శంకరయ్య పర్లపెల్లి ఆనందం, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ రాజనర్సింగరావు

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.12,200 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి గురువారం తీర్పునిచ్చారు. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ మైనర్ బాలిక ఇంట్లోకి ప్రవేశించి మాయమాటలు చెప్పి రెడపాక శ్రీనివాస్ అనే యువకుడు 2021 సంవత్సరంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై గొల్లపెల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి ఎస్సైలు జీవన్, సతీష్ సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రాజు, కిరణ్, శ్రీధర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ రావు కేసు వాధించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు.

డీలర్లు విత్తన రసీదులు ఇవ్వాలి

మల్యాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు సందర్బంగా రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. బాస్కర్ డీలర్లను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని విత్తన, రసాయన ఎరువుల దుకాణాలను గురువారం డీఈవో పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ నాన్యమైన విత్తనాలును అందుబాటులు ఉంచుతూ విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు అమ్మకూడదన్నారు.

అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎరువురును పీఏసీఎస్ ద్వారనే విక్రయిం చాలన్నారు. అనంతరం ముత్యంపేటలోని రైతుల పంట పొలాలను సందర్శించారు. ఈసందర్బంగా డీఏవో వెంట మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, ఏఈవో కారుణ్యకుమార్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు 'డబుల్'

(ఐదో పేజీ తరువాయి)

సేకరణకు వెళ్లడం లేదు. దీంతో చెత్త వేయడానికి కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల పట్టణంలోని చెత్తను తమ ప్రాంతంలోనే ఉన్న చెత్త డంప్‌లో వేయడానికి నిత్యం అనేక వాహనాలు వస్తున్నప్పటికీ తమ ఇళ్ల నుంచి తీసుకెళ్లడానికి మున్సిపల్ సిబ్బంది ఆగడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి
-వినోద్ కుమార్, నూకపల్లి అర్బన్ కాలనీ



మేము జగిత్యాల పట్టణంలో నుంచి నూకల్లి కాలనీకి వచ్చి నివసిస్తున్నాం. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం. కానీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి. నీటి సమస్య తీర్చి మురికి కాలువలను శుభ్రం చేయించాలి. మురికి కాలువలలో పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు చేరి అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలి.

తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
-రహమాన్, నూకపల్లి అర్బన్ కాలనీ



కాలనీలో తాగు నీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. పూర్తి స్థాయిలో లబ్ధిదారులు చేరితే నీటికి మరింత ఇబ్బందులు తప్పవు. మేము డ్రమ్ముల్లో నీళ్ళ నిల్వ చేసుకుంటున్నాం. ఇప్పటికే కొంత మంది నీరు లేక తిరిగి జగిత్యాలకు వెళ్లిపోయారు. కాలనీలో నీటి సౌకర్యంతో పాటు ఇతర వసతులు కల్పిస్తు ఎమ్మెల్యేకు రుణ పడి ఉంటాం.

ఆసుపత్రి ఎదుట మృతురాలి బంధువుల ధర్నా



పల్లవి ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

జగిత్యాల అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పల్లవి ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో సారంగాపూర్ మండలం పోచంపేట గ్రామానికి చెందిన అయిత రాజవ్వ(42) అనే మహిళ గురువారం ఉదయం మృతి చెందింది. రాజవ్వకు గర్భసంచిలో గడ్డలు రాగా ఆపరేషన్ కోసం బంధువులు బుధవారం సాయంత్రం పల్లవి ఆసుపత్రిలో చేర్చారు. ఆమెకు ఆపరేషన్ చేస్తుండగా హార్ట్ ఎటాక్ వచ్చి మృతి చెందిందని వైద్యురాలు రాజవ్వ కుటుంబ సభ్యులకు తెలిపారు. హైదరాబాద్‌లోని వైద్యులతో ఫోన్‌లో వీడియోకాల్ చేస్తూ ఆపరేషన్ చేయడం వల్లనే మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట బంధువులు బైఠాయించి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సమయంలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల తన భార్య మృతి చెందిందని రాజవ్వ భర్త గంగాధర్ ఆరోపించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతురాలి బంధువులను సముదాయించారు. జగిత్యాలకు చెందిన వైద్యులు మృతురాలి బంధువులతో మంతనాలు జరిపి వారిని శాంతింపజేశారు. దీంతో రాజవ్వ మృతదేహాన్ని బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయమై పల్లవి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పద్మినిని వివరణ కోరగా రాజవ్వకు గర్భసంచిలో గడ్డ పెద్దదిగా ఉందని, ఆమెకు లాప్రోస్కోపిక్ ఆపరేషన్ చేయడానికి తాము సిద్ధమవుతుండగానే అకస్మాత్తుగా హార్ట్ అటాక్ వచ్చి మృతి చెందిందని తెలిపారు. ఇతర వైద్యులను కూడా పిలిపించి ప్రయత్నించినప్పటికీ రాజవ్వ ప్రాణాలను కాపాడలేకపోయామని ఆమె చెప్పారు.



రాజవ్వ (ఫైల్)

పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రెండు రెడ్డి సంఘాల కులస్తులు, యాదవులు ఆదివారం ఎల్లమ్మ, పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం బోనం ఎత్తుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రూ. 53.64 లక్షల ధాన్యం డబ్బులు ఎగనామం

దళారీ మోసంతో రైతుల ఆందోళన

గొల్లపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన 52 మంది రైతులు తాము ఓ దళారి చేతిలో మోసపోయామని, వరి ధాన్యం డబ్బులు ఇప్పించి తమకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి గోడు వెల్లబోసుకోగా మంత్రి ఆదేశాలతో పోలీసు యంత్రాంగం కదిలింది. గొల్లపల్లి పోలీసు స్టేషన్‌లో రైతులు పిర్యాదు చేశారు. దళారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ధర్మారం మండలం కానంపల్లికి చెందిన బొంగోని పరశురాము గౌడ్ అనే హార్వెస్టర్ డ్రైవర్ యాసంగి సీజన్‌లో మండలంలోని దట్నూర్ గ్రామంలో వరి పంటను కోస్తూ రైతులతో పరిచయాలు పెంచుకున్నాడు. దీన్ని అదనుగా తీసుకుని రైతుల వరి ధాన్యం తానే కొనుగోలు చేస్తూ దళారి అవతారమెత్తాడు. మొదట రైతుల నుంచి కొనుగోలు చేసిన 8 డీసీఎం వ్యాన్ల ధాన్యం డబ్బులను రైతులకు చెల్లించాడు. అనంతరం కొనుగోలు చేసిన వరి ధాన్యంకు డబ్బులు రేపు.. మాపు అంటూ రైతులను మభ్యపెడుతూ వస్తున్నాడు. నలుబై ఐదు రోజులుగా తప్పించుకుతిరుగుతున్నాడు. పది రోజుల నుంచి దళారి ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో రైతులు ఆందోళన చెందారు. మొత్తం 52 మంది రైతులకు రూ. 53,64,000 రావాల్సి ఉన్నది. డబ్బులతో ఉడాయించినట్లు బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు.

మా డబ్బులు ఇప్పించండి
-పులి రవీందర్, బాధిత రైతు, దట్నూర్



కోతలు లేకుండా ప్రభుత్వ మద్దతు ధర చెల్లిస్తామని చెప్పి ఉడాయించాడు. మా ఊరిలో కొందరు పరశురాము గౌడ్‌కు వరి ధాన్యం విక్రయించడంతో నేను కూడా అతడికే అమ్మాను. డబ్బులు ఇవ్వకుండా మమ్మల్ని మోసం చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. దీనిపై ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నాం. మంత్రి ఆదేశాలతో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి గారు మా డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలి.

పూలు, మిఠాయిలతో విద్యార్థులకు స్వాగతం

పెగడపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. పాఠశాలల పునఃప్రారంబం రోజున గురువారం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉపాధ్యాయులంతా ఎదురుగా నిలబడి విద్యార్థులకు పూలు, మిఠాయిలు అందించి స్వాగతం పలికారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ నోట్ బుక్కులు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లలిత, ఉపాధ్యాయులు లచ్చయ్య, మాధవి, శంకరయ్య, శ్రావణ్ కుమార్, జ్యోతి, లక్ష్మణ్, శ్రీనివాస్, విజయ్ కుమార్, వేణుగోపాల్, పరమేశ్వర్, సంజీవ రెడ్డి, శ్రీధర్, మంజుభార్గవి, రమేష్, అనురాధ, హైమద్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. ఈ సందర్బంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికి పాఠశాలలోకి ఆహ్వానించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి, కిషోర్, నాయకులు, కోంద్ర రాంచంద రోరెడ్డి, గుర్రాల రాజేందర్‌రెడ్డి, పీడీ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయ వార్షికోత్సవం

మల్యాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి అర్బన్‌హౌజింగ్ కాలనీలో గల సరస్వతి దేవి ఆలయంలో శుక్రవారం ఏకదశ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. జగిత్యాల ఎమ్మెల్యే ఎం.సంజయ్‌కుమార్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు.

రాష్ట్ర మంత్రులను కలిసి జువ్వాడి

కోరుట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకరం చేసి భాద్యతలు స్వీకరించిన మంత్రులను గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు మర్యాదపూర్వకంగా కలిసాడు. హైదరాబాదులోని మినిస్టరీ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ కుమార్, వివేక్ వెంకట స్వామి, వాకిటి శ్రీహరిని జువ్వాడి నర్సింగ రావు తన అనుచరులతో కలిసి పుష్పగుచ్చంను అందించి శాలువాలు పూలమాలలతో సత్కరించారు.

అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలు

కోరుట్ల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను ఏర్పాటు ప్రభుత్వ చేస్తుందని మండల విద్యాధికారి నరేశం అన్నారు. గురువారం మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను వివరిస్తూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలను అందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పృథ్వీ, గంధ్రాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేష్ గౌడ్, ఐకేపీ ఏపీఎం శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గం ఎంపిక

మెట్‌పల్లి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణ బీజేపీ కార్యవర్గం గురువారం నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్ తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఆధ్వర్యంలో పట్టణ కార్యవర్గం నియమించినట్లు అధ్యక్షుడు బోడ్ల రమేష్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా చెట్లపల్లి సత్యనారాయణ గౌడ్, బోల్ల నగేష్, మద్దెల లావణ్య, జెట్టి రూపేష్, జుంగుల అనిల్, తోగిటి రమేష్, కానూరి గంగాసాగర్, సుంకే ఆశోక్, తోకల నరేష్ నియమించినట్లు బోడ్ల రమేష్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

ఇబ్రహీపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పల్లిల్ని తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చదివించే విధంగా చొరవ చూపాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్ అన్నారు. గురవారం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో బడి బాట కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి పాల్గొన్ని ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాల అవరణలో విద్యార్థులకు యూనిఫార్మ్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు నర్మాద, సుదారాణి, విశాల్, రాణి, జోత్స్న అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

యావర్ రోడ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

జగిత్యాల , జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ప్రజల ప్రదాన సమస్య యావర్ రోడ్ అని జగిత్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ తర్వాతా ట్రాఫిక్ బాగా పెరిగింది అందువల్ల యావర్ రోడ్ విస్తరణ జరగాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కు కేటాయించిన ప్రత్యేక నిదులు 50 కోట్లు యావర్ రోడ్ అబివృద్ది కి కేటాయంచాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా బవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభ దృష్ట దశాబ్దంన్నర క్రితమే బైపాస్ రోడ్డు వేసి గొల్లపెల్లి, ధర్మపురిలకు ట్రాఫిక్ మళ్ళించామని అన్నారు. 2018లో యావర్ విస్తరణ చేపడితే ఎక్కడ కాంగ్రేస్‌కు పేరు వస్తుందోనని అప్పటి పురపాలక మంత్రి కెటిఆర్ ప్రతిపాదనలు తొక్కి పెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయంలోనే రోడ్డు విస్తరణ పూర్తి అయ్యేదని అప్పుడు ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా టిడిఆర్ తెరపైకి తీసుకువచ్చి ఆదేశల గడిపారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఆశించిన పలితాలు రానప్పటికి జగిత్యాల అభివృద్దిని దృష్టిలో ఉంచుకుని గత సంవత్సరం జూన్‌లో ముఖ్యమంత్రికి లేఖ రాశానని దానికి స్పందించిన ముఖ్యమంత్రి నివేదిక కోసం అదికారులకు సూచించారన్నారు. యావర్ రోడ్ అబివృద్దికి వంద కోట్లు అవుతాయని అదికారులు డిసెంబర్ మున్సిపల్ డైరెక్టర్‌కు నివేదిక పంపారన్నారు. మున్సిపల్ నిధులతో పాటు యావర్ రోడ్ జాతీయ రహదారి అయినందున ఎంపీ సహకారం తీసుకోవాలని అన్నారు. నూకపెల్లి డబుల్ బెడ్ రూం కాలనీ లో లబ్దిదారులకు ఇళ్ళు కెటాయించి రెండెళ్ళు కావస్తున్న వారు అందులో చేరలేదని మౌళిక వసతులు కల్పన విషయంలో ఎందుకు అలస్యం అవుతునదో అర్థం కావట్లేదన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు కొత్త మోహన్, టిపిసిసి కార్యధర్శి బండ శంకర్, గాజుల రాజేందర్, కండ్లపెల్లి దుర్గయ్య, రాధా కృష్ణ, రఘువీర్, గుండా మధు, గుడిసే జితెందర్, పోగళ్ళ శ్రీనివాస్, మున్నా పాల్గొన్నారు.

పోషణతో కూడిన విద్య అందించడమే లక్ష్యం

కోరుట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్ వాడి కేంద్రాలలో పోషణతో కూడిన విద్యను అందచడమే లక్ష్యమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ అలవాల బారతి అన్నారు. గురువారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలోని అంగన్ వాడి కేంద్రాలలో అమ్మ బాట - అంగన్ వాడి బాట కార్యక్రమంలో భాగంగా కాలనీలో ర్యాలీలు నిర్వహించి అంగన్ వాడి కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు సరిత ఆయాలతో పాటు పలువురు పాల్గొన్నారు.



పోషణపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్

●కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్, మోహన్‌రావుపేట గ్రామాలలో అంగన్ వాడి కేంద్రాలలో అమ్మ మాట- అంగన్ వాడి బాట కార్యక్రమాన్ని ఐసిడిసీ, అంగన్ వాడి టీచర్లు నిర్వహించారు. ఈ సందర్బంగా అంగన్ వాడి కేంద్రాలలో నిర్వహించు విద్యతో పాటు పోష్టిక ఆహార వివరాలను వివరిస్తూ ర్యాలీలను నిర్వహించారు.

●మెట్‌పల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ షమీనాసుల్తానా అన్నారు. గురువారం మండలంలోని రంగరావుపేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఆరోగ్య, విద్య శాఖలతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలో గొల్లవాడ 2వ అంగన్‌వాడీ కేంద్రం, మండలంలోని ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాటలో బాగంగా చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఐసీడీఎస్ సీడీపీవో మమత, అంగన్‌వాడీ టీచర్లు ఉప్పుల రమాదేవి, మిట్టపల్లి పద్మ, దీకొండ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

●బీర్‌పూర్:మూడు సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ధర్మపురి సిడిపిఓ వాణిశ్రీ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడెం, తాళ్ళధర్మారం గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను రూపుదిద్దడానికి ప్రభుత్వం అన్ని విదాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శైలజ పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

●కథలాపూర్ : ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని సిరికొండ, కథలాపూర్ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు.

●కథలాపూర్: విద్యాహక్కు చట్టంను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ గురువారం ఎంఈఓ లోకిని శ్రీనివాస్‌కు బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు నల్ల వర్ధన్ వినతి పత్రం అందజేశారు.

●ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలోని కస్తూరీబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్ కంప్యూటర్ సైన్స్ ప్రారంభం అవుతుందని స్పెషల్ ఆఫీసర్ వి. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు.

●కొడిమ్యాల: జగిత్యాల నుండి కోదాడ వరకు నిర్మాణం కొనసాగుతున్న ఎన్‌హెచ్ఏఐ 563 జాతీయ రహదారిలో మండలంలోని పూడూర్ గ్రామంలో ఆస్తులు, ఇండ్లు, వ్యవసాయ భూములు, బోర్లు, కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని పూడూర్ గ్రామ మాజీ సర్పంచు వెల్మల రాంరెడ్డి గురువారం వరంగల్ ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు, జగిత్యాల ఆర్డీవోకు వినతి పత్రాలను పంపినట్లు తెలిపారు.

●మెట్‌పల్లి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన పథకంలో ఎంపికైనా లబ్ధిదారులు గ్రామాల్లోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం జగ్గసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు.

●కొడిమ్యాల: రైతులు సన్న రకం వరి వంగడాలను వేసుకోవాలని జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ డి. పద్మజా సూచించారు. గురువారం మండలంలోని నాచుపల్లిలో జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు.